# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

రంగారెడ్డి | సంపుటి : 02 | సంచిక: 42 | పేజీలు: 4 | వెల: 4/- | శుక్రవారం ● 30, ఆగస్టు 2024 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి


లంచాల అధికారులపై

# వేటు తప్పదు

**- ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి**



హైదరాబాద్, (నమస్తే ఉదయం): హైదరాబాద్‌లో హైడ్రా పేరు చెప్పి భయపెట్టి.. బెదిరించి కొందరు కింది స్థాయి అధికారులు అవినీతికి పాల్పడు తున్నారని వచ్చిన ఫిర్యాదులపై ముఖ్య మంత్రి ఎ.రేవంత్ రెడ్డి స్పందించారు. గతంలో ఇచ్చిన నోటీసులు, రెండు మూడేండ్ల కిందటి ఫిర్యాదులను అడ్డంగా పెట్టుకొని కొన్ని చోట్ల రెవిన్యూ, మున్సిపల్, ఇరిగేషన్ అధికారులు డబ్బులు డిమాండ్ చేస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందని.. అటువంటి వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇలాంటి వసూళ్లకు పాల్పడే వారిపై ఫోకస్ పెట్టాలని ఏసీబీ, విజిలెన్స్ అధికారులను ముఖ్యమంత్రి అప్రమత్తం చేశారు.

# కృష్ణమ్మ తగ్గేదేలే...

**జూరాలకు తగ్గని వరద ప్రవాహం**

**ఇన్ ప్లో 2.94 లక్షలు, ఔట్ ప్లో 2.88లక్షలు**

**39 గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేసిన అధికారులు**

గద్వాల జిల్లా ప్రతినిధి,ఆగస్టు29(నమస్తే ఉదయం): కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతూ ప్రవహిస్తూ శ్రీశైలం దిశగా పరుగులు పెడుతోంది. వరద ప్రవాహ ఉధృతి అంతకంతకూ పెరుగుతూ వస్తోంది. ఎగువ జలాశయాల నుంచి వస్తున్న వరద ప్రవాహంతో జూరాలకు వరద ప్రవాహం ఏమాత్రం తగ్గడం లేదు. ఎగువన ఉన్న కర్ణాటక జలాశయాలతో పాటు కృష్ణానది పరివాహ ప్రాంతాలలో కురుస్తున్న భారీ వర్షాలతో జూరాల ప్రాజెక్టుకు భారీ వరద వచ్చి చేరుతోంది. వరద ప్రవాహం క్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో ప్రాజెక్టు అధికారులు 39 గేట్లు ఎత్తి దిగువకు 2,66,097 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. జల విద్యుత్ ఉత్పత్తికి 20,337 క్యూసెక్కుల నీటిని విడుదల చేయగా, జూరాల మీద ఆదారపడిన నెట్టెంపాడు, కుడి, ఎడమ, కోయిల్ సాగర్ లిఫ్టుకు నీటిని విడుదల చేశారు. మొత్తం 2,88,778 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేయడంతో కృష్ణమ్మ శ్రీశైలం వైపు పరుగులు తీస్తోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 8.087 టీఎంసీల నీరు నిల్వ ఉంది.



బీటెక్ అగ్రికల్చర్ ఇంజనీరింగ్,బీటెక్ ఫుడ్ టెక్నాలజీ కోర్సుల్లో

# కన్వీనర్ కోటా కింద మిగిలిన సీట్ల భర్తీ..

**- సెప్టెంబర్ 2 స్పాట్ కౌన్సిలింగ్..**

రాజేంద్రనగర్,ఆగస్టు 29 (నమస్తే ఉదయం): ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఎంపీసీ స్ట్రీమ్ లో ఉన్న బీటెక్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్,బీ.టెక్ ఫుడ్ టెక్నాలజీ కోర్సులలో కన్వీనర్ కోటా సీట్లను తెలంగాణ ఎంసెట్ -2024 కన్వీనర్ వివిధ దశల్లో భర్తీ చేయడం జరిగింది.బీటెక్ అగ్రికల్చర్ ఇంజనీరింగ్,బీటెక్ ఫుడ్ టెక్నాలజీ కోర్సుల్లో కన్వీనర్ కోటా కింద మిగిలిన సీట్ల భర్తీకై ప్రొఫెసర్ జయశంకర్ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం స్పాట్ కౌన్సిలింగ్ ను సెప్టెంబర్ 2 వ తేదీ ఉదయం 10:30 గంటలకు రాజేంద్రనగర్‌లోని ఎగ్జామినేషన్ సెంటర్లో నిర్వహిస్తారని విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ పి.రఘురామిరెడ్డి తెలిపారు.ఈ కౌన్సిలింగ్‌కు ఎంపీసీ స్ట్రీమ్ కింద తెలంగాణ ఎప్సెట్ 2024లో అర్హత సాధించిన లేదా ఇంటర్ లేదా తత్సమాన కోర్సులలో ఉత్తీర్ణులైన అభ్యర్థులు కూడా హాజరుకావచ్చు. స్పాట్ కౌన్సిలింగ్ విధివిధానాలు అర్హత ప్రమా ణాలు సీట్ల వివరాలు, ఇతర సమాచారం కొరకు అభ్యర్థులు యూనివర్సిటీ వెబ్సైట్ www.pjtsau.edu.in సంప్ర దించగలరని తెలియజేశారు.




వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిపాలన భవనం







స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అన్ని విధాలుగా

# సమాయత్తం కావాలి

**- రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సి.పార్థసారథి**

గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 29(నమస్తే ఉదయం): స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అన్ని విధాలుగా సమాయత్తం కావాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సి.పార్థసారథి సూచించారు. గురువారం ఆయన జిల్లా కలెక్టర్లు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు, జెడ్పీ సీఈ ఓలు, డీపీఓలు, ఎన్నికల రిటర్నింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి మాట్లాడుతూ...వచ్చే నాలుగైదు నెలల వ్యవధిలో స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తి చేయడం జరుగు తుందని స్పష్టం చేశారు. ముందుగా మూడు దశలలో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తామని, అనంతరం ఎంపిటీసీ, జెడ్పిటీసీ ఎన్నికలు, చివరగా మున్సిపల్ ఎన్నికలు జరుగుతాయని వెల్లడించారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఎన్నికల నిర్వహణ ఏర్పా ట్లపై పకడ్బందీగా దృష్టిని కేంద్రీకరించాలని, జిల్లా ఎన్నికల అధికారులైన కలెక్టర్లు ఏర్పాట్లను సూచిం చారు. శాసనసభ, పార్లమెంటు ఎన్నికలతో పోలిస్తే, పార్టీలకు అతీతంగా జరిగే స్థానిక సంస్థల ఎన్నికలు సున్నితత్వంతో కూడుకుని ఉంటాయని, ఏమాత్రం అజాగ్రత్తకు తావివ్వకుండా, ఎలాంటి ఫిర్యాదులకు ఆస్కారం లేకుండా ప్రశాంత వాతా వరణంలో, పారదర్శకంగా ఎన్నికలను నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కమిషనర్ హితవు పలికారు. ఓటరు జాబితా రూపకల్పన, పోలింగ్ కేంద్రాల మ్యాపింగ్ వంటి ప్రక్రియలను తక్షణమే చేపట్టి నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలన్నారు. సెప్టెంబర్ 6న ఓటరు జాబితా డ్రాఫ్ట్ నోటిఫికేషన్ వెలువరించి అభ్యంతరాలు స్వీకరించాలని, సెప్టెంబర్ 21 న తుది ఓటరు జాబితాను వెలువరించాల్సి ఉంటుందన్నారు.

ఏ చిన్న పొరపాటుకు కూడా ఆస్కారం లేకుండా ప్రతీ దశలోనూ జాగ్రత్తలు తీసుకోవాలని సూచిం చారు. పంచాయతీరాజ్ చట్టం-2018 తో పాటు, ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో స్థానిక సంస్థల అద నపు కలెక్టర్లు క్రియాశీలక పాత్ర పోషించాలని తెలి పారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఉన్న ఓటరు జాబితాను గ్రామ

మిగతా.. 2లో



హైదరాబాద్ ఇమేజ్‌ను

# పెంచేలా గణేష్ ఉత్సవాలు

**అనుమతులు తీసుకున్న మండపాలకు ఉచిత విద్యుత్**

**అధికారులు, మండప నిర్వాహకులు సమన్వయంతో ముందుకు సాగాలి**

**గణేష్ ఉత్సవ సమితి సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

**సుప్రీంకోర్టు నిబంధనలను పరిగణనలోకి తీసుకోవాలి**

హైదరాబాద్,ఆగస్టు 29(నమస్తే ఉదయం): హైదరాబాద్ తొలి నుంచి మత సామరస్యానికి, ప్రశాంతతకు పేరు పొందిందని, ఆ ఇమేజ్‌ను మరింత పెంచేలా గణేష్ ఉత్సవాల నిర్వహణ ఉండాలని, ఇందుకోసం ఉత్సవ కమిటీలు, మండప నిర్వాహకులు, ప్రభుత్వ అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. గణేష్ ఉత్సవాల నిర్వహణపై రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన గురువారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మూడు ప్రధాన అంశాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంద న్నారు. మండపాల ఏర్పాటు, తొమ్మిది రోజుల ఉత్సవాల నిర్వహణ, నిమజ్జనానికి సంబంధించి మండప నిర్వాహ కులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రభుత్వం తరపున పోలీసు,

మిగతా.. 2లో



సీఎం రేవంత్ రెడ్డిపై

## సుప్రీంకోర్టు సీరియస్

- వ్యక్తులను,పార్టీలను సంప్రదించి నిందితులకు బెయిల్ ఇస్తామా?
- సీఎంకు సుప్రీంకోర్టంటే గౌరవం ఉండద్దా?
- అలాగైతే మేం ఓటుకు నోటు కేసును మధ్యప్రదేశ్‌కు బదిలీ చేస్తాం
- సుప్రీంకోర్టు జస్టిస్ గవాయి
- సారీ.. మేం రేవంత్‌రెడ్డికి కౌన్సిలింగ్ ఇస్తాం
- మరోసారి ఇలా జరగని లాయర్ల వేడుకోలు
- రేవంత్ వ్యాఖ్యలు బూమెరాంగ్

2లో



విపత్తుల నిర్వహణ వ్యవస్థను

# బలోపేతం చేస్తాం

- తొమ్మిది విభాగాలతో సమావేశం నిర్వహించిన రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

హైదరాబాద్,ఆగస్టు 29(నమస్తే ఉదయం): రాష్ట్రంలో విపత్తులు సంభవించినప్పుడు వాటిని తట్టుకుని ప్రాణ నష్టం, ఆస్తి నష్టం తగ్గించడానికి, ఆకస్మికంగా ఎదురయ్యే పరి స్థితులను సైతం ఎదుర్కొనేలా విపత్తుల నిర్వ హణ వ్యవస్థను (డిజాస్టర్ మేనేజ్మెంట్) బలోపేతం చేస్తున్నామని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబం ధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. గురువారం నాడు సచివాలయంలోని తన కార్యా లయంలో వరద కార్యాచరణ ప్రణాళికపై సమీక్ష

మిగతా.. 2లో

నేతన్నకు చేయూత పథకం కింద

# 90 కోట్లు నిధులు విడుదల

- గత ప్రభుత్వం నేతన్నకు చేయూత కింద బకాయి పెట్టిన నిధులతో సహా ఎలాంటి బకాయిలు లేకుండా నిధుల విడుదల
- గత ప్రభుత్వం నేతన్నలకు చేసింది గోరంత, చెప్పుకునేది కొండత
- నేత కార్మికుల సంక్షేమం కోసం మా ప్రభుత్వం కట్టుబడి ఉంది. అందుకే ఈ రోజు ఎలాంటి బకాయిలు లేకుండా నిధులు మొత్తం విడుదల చేశాము
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



హైదరాబాద్, ఆగస్టు 29(నమస్తే ఉదయం): చేనేత కార్మికులలో పొదుపు మరియు భద్రతా భావాన్ని పెంపొందించుటకు ప్రవేశపెట్టిన నేతన్నకు చేయూత పథకానికి సంబంధించి గత ప్రభుత్వం బకాయి పెట్టిన నిధులతో పాటు ఎలాంటి బకాయిలు లేకుండా ముఖ్యమంత్రి గారి చొరవతో ఏకమొత్తంగా 90 కోట్లను నేతన్నకు

మిగతా.. 2లో




# వాల్మీకి స్కామ్‌పై ఎందుకు నోరు మెదపడం లేదు?

- ఈడీ విచారణ కోరే దమ్ము కాంగ్రెస్ పార్టీకి ఉందా?
- రుణమాఫీ విషయంలో రేవంత్ రెడ్డి గజదొంగ
- రుణమాఫీ విషయంలో రాహుల్ గాంధీని రేవంత్ రెడ్డి మోసం చేశారు
- ఓటుకు నోటు కేసులో రేవంత్ రెడ్డికి బెయిల్ బీజేపీ ఇస్తేనే వచ్చిందా?
- 50 లక్షల రూపాయలు ఇస్తూ దొరికిన దొంగ రేవంత్ రెడ్డి
- పొంగులేటి ఇంటికి ఏమైనా స్పెషల్‌గా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఉందా?
- మాజీమంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు చిట్ చాట్

మిగతా.. 2లో

# పదునెక్కుతున్న 'హైడ్రా'!

- ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు పూర్తి పవర్స్
- త్వరలో అదనపు అధికారులు, సిబ్బంది
- ఉన్నత స్థాయి సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి



హైదరాబాద్, ఆగస్టు 29(నమస్తే ఉదయం): చెరువుల ఆక్రమణల తొలగింపు, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణపై గత కొన్ని రోజులుగా రాష్ట్ర హై-కోర్టు జారీ చేసిన ఆదేశాలను పరిగణనలోకి తీసుకుంటూ సమగ్ర కార్యాచరణ

మిగతా.. 2లో

# ఒవైసీ ఆస్తులను కూల్చేందుకు ధైర్యం చాలడం లేదా?

- ఒవైసీ కాలేజీలకు అడ్డొచ్చిన విద్యార్థులు పల్లా కాలేజీకి రాలేదా?
- హిందువులు ఉన్న చోట హైడ్రా కూల్చివేతలు
- పాతబస్తీకి వెళ్లే దమ్ము, ధైర్యం ఈ ప్రభుత్వానికి లేదా?
- ప్రమోషన్ కోసం పని చేస్తున్నారా?
- ఒవైసీ కాలేజీలకు అడ్డొచ్చిన విద్యార్థులు పల్లా కాలేజీకి రావడం లేదా?
- హైడ్రా కమిషనర్ రంగనాథ్ తీరును తప్పుబట్టిన బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి



హైదరాబాద్,ఆగస్టు 29(నమస్తే ఉదయం): హైడ్రా పని చేస్తున్న తీరుపై బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓల్డ్ సిటీలో నిర్మాణాలను ఎందుకు కూల్చడం లేదని ప్రశ్నిం చారు. హైడ్రా కమిషనర్ రంగా నాథ్ తీరును తప్పుబట్టారు. ఆయన ప్రమోషన్ కోసం పని చేస్తున్నారా? లేక ఓ అజెండాతో పని చేస్తున్నారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో వెంకట్రామిరెడ్డికి కేసీఆర్ ఎమ్మెల్సీ ఇచ్చినట్లు, మీకు ఇప్పుడు రేవంత్ రెడ్డి ఏమైనా టార్గెట్ ఇచ్చారా? అని ప్రశ్నించారు.

మిగతా.. 2లో

## సీఎం రేవంత్ రెడ్డిపై
# సుప్రీంకోర్టు సీరియస్

**ఢిల్లీ,(నమస్తే ఉదయం):**
తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పై సుప్రీంకోర్టు సీరియస్ అయ్యింది. ఢిల్లీ లిక్కర్ కేసులో ఎమ్మెల్సీ కవితకు బెయిల్ మంజూరు చేయడంపై మీడియా చిట్ చాట్ లో రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను సుప్రీం కోర్టు తీవ్రంగా పరిగణించింది.

ఓటుకు నోటు కేసు విచారణ సందర్భంగా సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ గవాయి రేవంత్ వ్యాఖ్యలను తప్పుబట్టారు. వ్యక్తులు, రాజకీయ పార్టీల అభిప్రాయాలు పరిగణలోకి తీసుకొని నిందితులకు తాము బెయిల్ ఇస్తామా అని రేవంత్ రెడ్డి తరపు అడ్వొకేట్లను ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి మీడియా చిట్ చాట్ చేసిన వ్యాఖ్యలను ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న వ్యక్తికి సుప్రీం కోర్టు పట్ల గౌరవం ఉండాలని అన్నారు.

రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న వ్యక్తి ఈ తరహా వ్యాఖ్యలు చేయడం ఏమాత్రం సముచితం కాదన్నారు. ఇలాంటి కండక్ట్ ఉన్న వ్యక్తి తెలంగాణ సీఎంగా ఉన్నాడు కాబట్టి తాము ఓటుకు నోటు కేసును పిటిషనర్ కోరినట్టు మధ్యప్రదేశ్ హైకోర్టు బదిలీ చేయాలని ఆదేశాలు ఇవ్వొచ్చు అన్నారు. ఈ దశలో రేవంత్ రెడ్డి తరపున వాదిస్తున్న సీనియర్ అడ్వొకేట్లు జోక్యం చేసుకొని ముఖుల్ రోహత్గీ, సిద్దార్థ లూథ్రా ఇంకోసారి ఇలాంటివి రిపీట్ కాకుండా చూసుకుంటామని తెలిపారు.

సీఎం రేవంత్ రెడ్డికి కౌన్సెలింగ్ ఇచ్చి మరోసారి రిపీట్ కానివ్వబోమనిని, సీఎం కామెంట్స్ పై ఎలాంటి ఆదేశాలు ఇవ్వొద్దని విజ్ఞప్తి చేశారు. అడ్వొకేట్ల విజ్ఞప్తికి స్పందించిన జస్టిస్ గవాయి కేసు విచారణను సోమవారానికి వాయిదా వేశారు.

## నేతన్నకు చేయూత పథకం కింద
# 90 కోట్లు నిధులు విడుదల

**(మొదటి పేజీ తరువాయి)**
చేయూత కింద ఈ రోజు విడుదల చేయడం జరిగిందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలియజేశారు. ఈ పథకం సెప్టెంబర్ 2021 నాడు మొదలై ఆగస్టు 2024 న ముగియనుందని, ఈ నిధుల విడుదల ద్వారా 36,133 మంది చేనేత కార్మికులు లబ్ధిపొందుతారని తెలిపారు. ఈ పథకంలో చేనేత కార్మికులు మరియు అనుబంధ కార్మికులు తమ నెలసరి వేతనంలో 8 శాతం వాటా జమచేసినట్లైతే ప్రభుత్వం తమ వాటాగా 16 శాతంను పొదుపుఖాతాలో జమచేయడం జరుగుతుందని, ఈ మొత్తాలను వడ్డీతో సహా 3 సంవత్సరాల గడువు కాలం పూర్తికాగానే లబ్ధిదారులకు చెల్లించడం జరుగుతుందని జరుగుతుందని మంత్రి తెలిపారు.

దీనివలన ఒక్కొక్క చేనేత కార్మికుల 3 సంవత్సరాల గడువు కాలం పూర్తికాగానే వడ్డీతో సహా సుమారుగా రూ. 60,000 నుండి 1,29,000 వరకు లబ్ధిపొందనున్నారని,.గత ప్రభుత్వం నేతన్నలను పట్టించుకోకుండా బకాయిపెట్టి వారి నోట మట్టికొట్టిందని, కానీ మా ప్రభుత్వము అధికారములోకి రాగానే పథకం ముగిసే సమయానికి ముందే గత ప్రభుత్వం పెట్టిన బకాయిలతో పాటు ఎలాంటి బకాయిలు లేకుండా నేతన్నలకు సామాజిక భద్రత కలిగించాలనే ఉద్దేశ్యంతో నిధులు విడుదల చేయడం జరిగిందన్నారు.

మా ప్రభుత్వం చేనేత కార్మికుల సంక్షేమానికి ఎల్లప్పుడు కట్టుబడి ఉందని చెప్పడానికి ఇది ఒక చిన్న ఉదాహరణ మాత్రమే అని మంత్రిగారు పేర్కొన్నారు. చేనేత కార్మికులు పడే కష్టానికి ఎలాంటి నష్టం కలగకుండా వారికి సరైన ప్రతిఫలం అందేలా మా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. చేనేత ఉత్పత్తులను ప్రోత్సహించడం ద్వారా ఈ రంగంలో మరింత అభివృద్ధి సాధించి, తద్వారా చేనేత కార్మికులను ఆర్థికంగా బలో పేతం చేయాలన్నదే మా లక్ష్యమని మంత్రి తెలియజేశారు.

## విపత్తుల నిర్వహణ
# వ్యవస్థను బలోపేతం చేస్తాం

**(మొదటి పేజీ తరువాయి)**
నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ అరవింద్ కుమార్, ఎస్. హరీష్, జాయింట్ సెక్రెటరీ, రెవెన్యూ (డిజాస్టర్ మేనేజ్మెంట్), హైడ్రా కమిషనర్ ఏ. వి. రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూ, ఇరిగేషన్, మునిసిపల్, పంచాయతీరాజ్, ప్లానింగ్, వాతావరణ శాఖ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ 10 సంవత్సరాల తర్వాత తొలిసారిగా వరదలపై యాక్షన్ ప్లాన్ రూపొందిస్తున్నామని తెలిపారు. వరదలతో సంబంధం ఉన్న ప్రతి విభాగం రాష్ట్ర స్థాయిలో, జిల్లా స్థాయిలో వరద లపై కార్యాచరణ ప్రణాళికలు రూపొందించుకోవాలని అధికారులను ఆదేశించారు. గోదావరి, కృష్ణా పరీవాహక ప్రాంతాలలో వరద ముప్పును తగ్గించడానికి అవసరమైన ప్రణాళికలను తయారు చేయాలని సూచించారు. రాష్ట్ర స్థాయిలో డిజాస్టర్ మేనేజ్మెంట్ తరపున ఒక టోల్ ఫ్రీ నెంబర్ ను ఏర్పాటు చేయాలని సూచించారు.

వరదలు, కాలువలు, చిన్న డ్రైనేజీలనుంచి మొదలుకుని, హైరైజ్ భవనాల వరకు ఏ పరిస్థితి ఎదురైనా దానిని అధిగమించడానికి వీలుగా అధునాతన పరికరాలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. అన్నీ విభాగాలు వరద ముప్పును ఎదుర్కోవడానికి కావలసిన ప్రణాళికలను సిద్ధం చేసుకుని రావాలని త్వరలో దీనిపై మరోసారి సమావేశం నిర్వహిస్తామని వెల్లడించారు.


హైడ్రా పరిధిలో డిజాస్టర్ మేనేజ్మెంట్ బలోపేతానికి తీసుకుంటున్న చర్యలను హైడ్రా కమిషనర్ రంగనాథ్ వివరించారు. గతంలో 30 బృందాలు ఉండగా దాన్ని 70 కి పెంచామని అలాగే సిబ్బంది సంఖ్యను 1800 నుండి 3500 వరకు పెంచడం జరిగిందని వివరించారు.

దీనిపై మంత్రిగారు స్పందిస్తూ డిజాస్టర్ మేనేజ్మెంట్‌కు సంబంధించి హైడ్రాకు పూర్తి సహాయ సహకారాలు అంది స్తామని హైడ్రాకు కావలిసిన అధునాతన పరికరాలు అందిస్తా మని ఇందుకు అవసరమైన ప్రతిపాదనలను పంపించాలని హైడ్రా కమిషనర్‌కి సూచించారు.

# విషజ్వరాల విజృంభణ

### ప్రభుత్వ నిర్లక్ష్యం పట్ల మాజీ మంత్రి హరీష్ రావు ఆగ్రహం

**హైదరాబాద్,ఆగస్టు 29(నమస్తే ఉదయం):**
పడకేసిన పల్లె వైద్యం.. మంచమెక్కిన మన్యం.. సీజనల్ వ్యాధులతో జనం విలవిల.. ఊరంతా విషజ్వరాలే.. ఇలాంటి వార్తలను సమైక్య పాలనలో చూసేవాళ్లం. కాంగ్రెస్ పాలన పుణ్యమా అని నేడు ఏ పత్రిక చూసినా మళ్లీ ఆ వార్తలే కనిపిస్తున్నాయి.మలేరియా, డెంగీ, గన్యా వంటి విషజ్వరాలు రాష్ట్రవ్యాప్తంగా విజృంభిస్తుంటే పాలకులకు చీమకుట్టినట్లైనా లేకపోవడం దుర్మార్గం.జ్వరాలతో ప్రాణాలు కోల్పోయే పరిస్థితి వచ్చిందంటే ప్రభుత్వ నిర్లక్ష్యం పరాకాష్టకు చేరిందని అర్థం. పాలన గాడితప్పడం, పారిశుద్ధ్యం పడకేయడంతో పల్లె, పట్టణం తేడా లేకుండా ప్రజలు రోగాల బారిన పడుతున్నరు. ప్రతి రెండు ఇండ్లలో ఒకరు వైరల్ ఫీవర్ తో వణికిపోతున్నరు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందులు లేక, డెంగీ కిట్స్ లేక రోగులు ప్రైవేటుకు వెళ్లి అప్పుల పాలవుతున్నారు.



ఇదంతా చూసీ చూడనట్లు ప్రభుత్వం, వైద్యారోగ్య శాఖ వ్యవహరిస్తుండటం శోచనీయం. తప్పుడు లెక్కలు విడుదల చేస్తూ, విషజ్వరాల కేసులను తక్కువ చేసి చూపడం వల్ల ఎలాంటి ప్రయోజనం లేదు.

ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరిచి యుద్ధ ప్రాతిపాదికన చర్యలు తీసుకోవాలి. విషజ్వరాల కారణంగా ఏ ఒక్కరు ప్రాణం కోల్పోకుండా చూడాలి. విషజ్వరాలు విజృంభించిన ప్రాంతాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి వైద్యం అందించాలి. పల్లె, పట్టణాల్లో పారిశుద్ధ్యం మెరుగు పరచాలి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందులు, డెంగీ కిట్స్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి.

# స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అన్ని విధాలుగా సమాయత్తం కావాలి

(మొదటి పేజీ తరువాయి)
పంచాయతీల వారీగా రూపొందించుకోవాలని, అర్హులైన ఏ ఒక్క ఓటరు పేరు కూడా జాబితా నుండి గల్లంతు కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమై ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై చర్చించాలని అన్నారు. సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తిస్తూ, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ప్రశాంత వాతావరణంలో, పూర్తి పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిపించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఎన్నికల కమిషనర్ పార్థసారథి సూచించారు. ఒక్కో పోలింగ్ కేంద్రం పరిధిలో 600 వరకు ఓటర్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఓటర్ల సంఖ్య 650 దాటితే అదనపు పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలన్నారు. ఒక వార్డులోని ఓటరుకు మరో వార్డులో ఓటు హక్కు ఉండకుండా జాగ్రత్త వహించాలని, ఒకే కుటుంబానికి చెందిన ఓటర్ల ఓటు ఒకేచోట ఉండేలా ఓటరు జాబితాను నిశితంగా పరిశీలించాలని అన్నారు. ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ, ప్రతిఒక్కరు తమతమ విధులను సమర్ధవంతంగా నిర్వహించాలని, అలసత్వాన్ని ఎంతమాత్రం ఉపేక్షించబోమని కమిషనర్ స్పష్టం చేశారు. బ్యాలెట్ బాక్సులు, ఇతర ఎన్నికల సామాగ్రిని సమకూర్చుకోవాలని, ఎన్నికల నిర్వహణ కోసం అవసరమైన పోలింగ్ సిబ్బందిని గుర్తించి, వారికి శిక్షణ తరగతులు ఏర్పాటు చేయాలని, ర్యాండమైజెషన్ ద్వారా పోలింగ్ కేంద్రాలలో విధులను కేటాయించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టర్ బి. యం. సంతోష్, అదనపు కలెక్టర్ నర్సింగ్ రావు, డి.పి.ఓ శ్యాం సుందర్, ఆర్.డి.ఓ. రామచందర్ తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ ఇమేజ్‌ను పెంచేలా గణేష్ ఉత్సవాలు

**(మొదటి పేజీ తరువాయి)**
జీహెచ్ఎంసీ, ఆర్ అండ్ బీ, నీటి పారుదల శాఖ, విద్యుత్ శాఖతో పాటు ఇతర ముఖ్య శాఖల అధికారులు సైతం మండప నిర్వాహకులతో సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు.

ఎక్కడ ఎటువంటి లోటుపాట్లకు తావివ్వద్దని హెచ్చరించారు. జోన్ల వారీగా ఉన్నతాధికారులకు బాధ్యతలు అప్పగించాలని, ఉత్సవ కమిటీ సభ్యులు, మండప నిర్వాహకులతో సమన్వయం చేసుకుంటూ శాంతియుతంగా ఉత్సవాలు, నిమజ్జనం కొనసాగేలా చూడాలని ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారిని ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఏ అధికారి ఏ జోన్‌లో బాధ్యతల్లో ఉన్నారు.. ఆయా ప్రాంతాల్లో ఉత్సవ కమిటీ ప్రముఖులు, మండపాల బాధ్యులు అన్నింటి వివరాలు సమగ్రంగా ఉండాలని ముఖ్యమంత్రి సూచించారు.

అవుటర్ రింగు రోడ్డు పరిధిలో గతేడాది 1.50 లక్షల విగ్రహాలు ఏర్పాటు చేశారనే లెక్కలున్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ముందుగా మండప నిర్వాహకులు ఆన్‌లైన్‌లో, ఆఫ్‌లైన్‌లోనో అనుమతులు తీసుకోవాలని, అలా తీసుకోవడం వలన ఆయా ప్రాంతాల్లో భద్రత, ట్రాఫిక్ ఇతర ఇబ్బందులు తలెత్తకుండా చూసుకునే అవకాశం ఉంటుందన్నారు.

మొత్తం విగ్రహాలను హుస్సేన్ సాగర్‌కే కాకుండా ఇతర చెరువుల్లోనూ నిమజ్జనం చేసే అవకాశాన్ని పరిశీలించాలని సూచించారు. సరూర్ నగర్‌తో పాటు పలు చెరువులు నీటితో ఉన్నాయని, ఏ ప్రాంతంలోని విగ్రహాలు ఆ ప్రాంతంలోని చెరువుల్లో నిమజ్జనం చేస్తే హుస్సేన్ సాగర్ వద్ద రద్దీ తగ్గడంతో పాటు ఆయా చెరువుల వద్ద నిమజ్జనానికి అవసరమైన ఏర్పాట్లను ప్రభుత్వం ముందుగానే చేసే వీలుంటుందన్నారు.

ఈ విషయంలో ఉత్సవ సమితి సభ్యులు, మండప నిర్వాహకులు ముందగానే సమాచారం ఇవ్వాలని ముఖ్యమంత్రి సూచించారు. నిమజ్జనానికి ముఖ్య అతిథులుగా ఎవరినైనా పిలిస్తే ముందుగానే ప్రభుత్వానికి సమాచారం ఇవ్వాలని, అలాగే వీవీఐపీలు ఎవరైనా వచ్చే అవకాశం ఉంటే ముందుగా తెలియజేస్తే పోలీసు శాఖ వారి రాకపోకలకు రూట్ క్లియరెన్స్ చేయడంతో పాటు తగిన భద్రత ఏర్పాటు చేస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు.

నిమజ్జన ఊరేగింపు త్వరగా ప్రారంభిస్తే త్వరగా కార్యక్రమాన్ని ముగించుకోవచ్చని, ఫలితంగా భక్తులు ట్రాఫిక్, ఇతర ఇబ్బందులు బారిన పడకుండా చూసుకోవచ్చన్నారు. ఉత్సవాల నిర్వహణకు సంబంధించి నగరం పరిధిలోని నలుగురు లోక్‌సభ సభ్యులు, ఎమ్మెల్యేల అభిప్రాయాలను తీసుకోవాలని ముఖ్యమంత్రి పోలీసు లను ఆదేశించారు. సెప్టెంబరు 16న మిలాద్ ఉన్ నబి, 17న తెలంగాణలో వివిధ రాజకీయ పార్టీలు పలు కార్యక్రమాలు చేపడ తాయని, అందువలన అన్ని కార్యక్రమాలకు సక్రమమైన ప్రణాళికతో ముందుకు సాగాలని, ఎక్కడా ఎటువంటి సమస్య తలెత్త కుండా చూసుకోవాలని పోలీసులను ముఖ్యమంత్రి ఆదేశించారు.

గణేష్ మండపాలకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి సభ్యులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. అందుకు ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. ముందుగా మండప నిర్వాహకులు ఉచిత విద్యుత్ సరఫరాకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అనుమతులు లేకుండా విద్యుత్ వినియోగిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని, జవాబుదారీతనం కోసమే అనుమతి చేసుకోవాలని కోరుతున్నామని తెలిపారు. నిమజ్జనం రోజైన సెప్టెంబరు 17వ తేదీన అనంత చతుర్దశి వచ్చిందని, ఆ తేదీ ప్రాముఖ్యతను తెలుపుతూ దేవాదాయ శాఖ తరఫున పర్వదిన ప్రాముఖ్యతను తెలిపే సాహిత్యాన్ని ప్రచురించాలని, ప్రచారం చేయాలని భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడు జి.రాఘవ రెడ్డి ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు.

అందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావును ముఖ్యమంత్రి ఆదేశించారు. మండపాల్లో డీజేలు వాడేందుకు అనుమతి ఇవ్వాలని రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్ ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. సుప్రీంకోర్టు నిబంధనల ప్రకారం ముందుకు వెళతామని ముఖ్యమంత్రి తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి పర్యావరణ హిత (ఈకో ఫ్రెండ్లీ) విగ్రహాలు ప్రతిష్టించాలని మంత్రి శ్రీధర్ బాబు ఉత్సవ సమితి నిర్వాహకులకు సూచించారు. గణేష్ ఉత్సవాలకు సంబం ధించి ఇప్పటివరకు చేపట్టిన సమావేశాలు, ఉత్సవ సమితి సభ్యులు చేసిన సూచనలు, పరిష్కరించిన సమస్యల వివరాలను మంత్రి పొన్నం ప్రభాకర్ వివరించారు. మొత్తంగా 25 వేల మందితో భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు డీజీపీ జితేందర్, హైదరాబాద్ సిటీ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

అన్ని శాఖలతోనూ సమన్వయం చేసుకుంటున్నామని వారు చెప్పారు. ఉత్సవాల్లో మట్టి విగ్రహాలు వాడేలా చూడాలని, మద్యం తాగి ఇబ్బంది పెట్టే వారి విషయంలో తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ ఏ.వి.ఎన్.రెడ్డి కోరారు.

సమావేశంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దామోదర రాజనరసింహ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు కేశవరావు, షబ్బీర్ అలీ, ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, మేయర్ గద్వాల విజయలక్ష్మి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, అన్ని శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పదునెక్కుతున్న 'హైడ్రా'!

**(మొదటి పేజీ తరువాయి)**
ప్రణాళిక రూపొందించేందుకై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి గురువారం ఉన్నత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా, ఓ.ఆర్.ఆర్ పరిధిలోని అన్ని చెరువులు, పార్కులు, నాలాలతో పాటు అన్ని ప్రభుత్వ స్థలాల పరిరక్షణ బాధ్యతలను పూర్తి స్థాయిలో హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా)కుఅప్పగించేందుకు విధి విధానాలను రూపొం దిస్తున్నట్టు తెలిపారు.

చెరువుల ఆక్రమణల తొలగింపు, ప్రభుత్వ ఆస్తుల పరి రక్షణపై రాష్ట్ర హై-కోర్టు జారీ చేసిన ఆదేశాలను పరిగణంలోకి తీసుకుంటూ, ప్రభుత్వ స్థలాలు, చెరువులు, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకై హైడ్రాకు మరిన్ని అధికారాలను, సిబ్బందిని అప్పగిం చేందుకు చేపట్టాల్సిన చర్యలపై సచివా లయంలో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు.

ఇంటలీజెన్స్ డీజీ శివధర్ రెడ్డి, శాంతి భద్రతల విభాగం అడిషనల్ డీజీ మహేష్ భగవత్, మున్సిపల్ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిషోర్, నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, హెచ్ఎండీఏ కమీషనర్ సర్ఫరాజ్ అహ్మద్, అడిషనల్ అడ్వకెట్ జనరల్ రజనీకాంత్ రెడ్డి, ఎసిబి డైరెక్టర్ తరణ్ జోషి, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజి గిరి, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా సి.ఎస్ శాంతి కుమారి మాట్లాడుతూ, చెరువులు, కుంటలు, పార్కులు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణల తొలగింపుపై ప్రస్తుతం నీటిపారుదల శాఖ, జీహెచ్ఎంసీ, పురపాలక శాఖ, పంచాయితీ రాజ్, వాల్టా తదితర విభాగాలు వేర్వేరుగా నోటీసులు జారీ చేస్తున్నారని, దీనివల్ల ఒకరకమైన కన్ఫ్యూజన్ ఏర్పడుతోందని అభిప్రాయపడ్డారు. దీనిని నివారించటానికి, ఓ.ఆర్.ఆర్.పరిధిలో అన్ని విధాలా ఆక్రమణల తొలగింపు నోటీసులను హైడ్రా ద్వారానే చేపట్టేందుకు విధి విధానాలు ఖరారు చేయాలని మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శిని ఆదేశించారు. జీ.హెచ్,ఎంసీ, ల్యాండ్ ఏంక్రోచ్మెంట్ ఆక్ట్, ల్యాండ్ గ్రాబింగ్ ఆక్ట్, వాల్టా చట్టం, నీటిపారుదల శాఖ చట్టాల ద్వారా జారి చేసే అన్ని రకాల నోటీసులు, తొలగింపులన్నీ పూర్తిగా ఒకే విభాగం హైడ్రా పరిధిలోకి తేనున్నట్టు వివరించారు.

హైడ్రాకు కావాల్సిన అదనపు అధికారులు, సిబ్బందిని త్వరలోనే కేటాయించనున్నట్టు తెలి పారు. ఎఫ్.టి.ఎల్, నాలా ఎంక్రోచ్మెంట్, , ప్రభుత్వ ఖాళీ స్థలాలు, పార్కుల పరిరక్షణ లను హైడ్రా పరిధిలోకి తేనున్నామని చెప్పారు. గండిపేట, హిమాయత్ సాగర్ చెరువుల పరిరక్షణ కూడా జల మండలి నుండి హైడ్రా పరిధిలోకి తేనున్నామని వెల్లడించారు. హైడ్రా ఆధ్వర్యంలో మొత్తం 72 బృందాలు ఏర్పాటయ్యాయని, వీటిని మరింత బలోపేతం చేయాడానికి కావాల్సిన పోలీస్, సర్వే, నీటిపారుదల శాఖల నుండి అధికారులు, సిబ్బందిని త్వరిత గతిన కేటాయించనున్నట్టు సి.ఎస్. తెలిపారు.

ఈ సమావేశంలో హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్, రంగా రెడ్డి కలెక్టర్ శశాంక, మేడ్చల్ మల్కాజిగిరి కలెక్టర్ గౌతమ్ పొత్రు, సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతిలు పాల్గొన్నారు.

## ఒవైసీ ఆస్తులను కూల్చేందుకు
# ధైర్యం చాలడం లేదా?

**(మొదటిపేజీ తరువాయి..)**
గురువారం ఆయన మీడియా సమావేశంలో మాట్లా డుతూ... మీకు మీరు పోలీసు అధికారి అనుకుంటున్నారా? లేక రాజకీయ నాయకుడు అనుకుంటున్నారా? అని రంగ నాథ్‌ను ప్రశ్నించారు. తనను విమర్శించే ముందు ఆలోచిం చాల్సింది అన్నారు. హైడ్రా పేరుతో వసూళ్లు జరుగు తున్నట్లుగా తన దృష్టికి వచ్చిందని సీఎం రేవంత్ రెడ్డి కూడా చెప్పారని గుర్తు చేశారు. దీనిని బట్టి హైడ్రా ఎలా నడుస్తుందో అర్థమవుతోందని ఎద్దేవా చేశారు.

సల్కం చెరువులోని ఒవైసీ భవనాల కూల్చివేతల విషయంలో విద్యార్థుల భవిష్యత్తు అంటూ రంగనాథ్ నీతులు చెబుతున్నారని, మరి కేఎల్‌ఆర్ ఇనిస్టిట్యూషన్స్, పల్లా రాజేశ్వర్ రెడ్డి వారి సంస్థలకు వర్తించదా? అని ప్రశ్నించారు. ఒవైసీ భవనాల కూల్చివేతకు విద్యార్థులు, విద్యా సంవ త్సరం అడ్డు వచ్చాయని చెబుతోన్న రంగనాథ్... ఇతర సంస్థల విషయంలో ఆ ఆలోచన ఎందుకు చేయడం లేదన్నారు. 365 రోజులు ఒవైసీ విద్యాసంస్థలు రన్ అవుతుంటే మీకు కూల్చేందుకు సమయం ఎలా చిక్కుతుందో చెప్పాలన్నారు.

అలాంటప్పుడు ఎన్ కన్వెన్షన్ కూల్చివేత సమయంలో అడ్వాన్స్ ఇచ్చిన వారి పరిస్థితి ఏమిటో చెప్పాలన్నారు.

మీరు కూల్చాలనుకున్న నిర్మాణాలను వెంటనే కూల్చేస్తున్నారని, కానీ మీ మిత్రుడు ఒవైసీకి చెందిన సంస్థలపై సాకులు చెబుతు న్నారని మండిపడ్డారు. అక్బరుద్దీన్ ఒవైసీని ఉపముఖ్య మంత్రిగా చేస్తానని రేవంత్ రెడ్డి చెప్పారని గుర్తు చేశారు. ఇప్పటికే అక్బరుద్దీన్ అనధికార ఉపముఖ్య మంత్రిగా ఉన్నా రన్నారు. ఒవైసీ భవంతులను కూల్చేందుకు ఈ ప్రభుత్వానికి దమ్ము, ధైర్యం లేదన్నారు.

హిందువులు ఉన్న చోట హైడ్రా కూల్చివేతలు చేపడు తోందని, మరి పాతబస్తీకి ఎందుకు వెళ్లడం లేదో చెప్పాలన్నారు. పాతబస్తీకి వెళ్లే దమ్ము, ధైర్యం ఈ ప్రభుత్వానికి లేదా? లేదంటే పూర్తిగా ఒవైసీ కనుసన్నుల్లో ఈ ప్రభుత్వం పని చేస్తోందా? అనే అనుమానం కలుగుతోందన్నారు. గతంలో బీఆర్ఎస్ ఇలాగే మజ్లిస్ పార్టీతో దోస్తీ చేస్తే ప్రజలు బుద్ధి చెప్పారన్నారు.ఒవైసీ ఆస్తుల వైపు చూసేందుకు కూడా ప్రభుత్వానికి ధైర్యం చాలడం లేదన్నారు. పాతబస్తీలో హైడ్రా ఎందుకు పని చేయడం లేదో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. కూల్చి వేతల విషయంలో హైడ్రా ఒక వర్గాన్ని మాత్రమే టార్గెట్ చేస్తున్నట్లుగా కనిపిస్తోందన్నారు. ఒవైసీ కాలేజీని కూల్చిన తర్వాతే ఇతర సంస్థ లను ముట్టుకోవాలని అల్టిమేటం జారీ చేశారు. తెలంగాణలో స్టీరింగ్ మజ్లిస్ చేతిలో ఉన్నట్లుగా కనిపిస్తోందన్నారు.

# వాల్మీకి స్కామ్‌పై ఎందుకు నోరు మెదపడం లేదు?

**హైదరాబాద్,(నమస్తే ఉదయం):**
రేవంత్ రెడ్డి చేసేది చిట్ ఛాట్ కాదు...చీట్ ఛాట్. ఢిల్లీలో చిట్ చాట్ చేస్తూ ఓల్డ్ సిటీ విద్యుత్ బకాయిలను ఆదానీకి అప్పగిస్తామని రేవంత్ రెడ్డి అన్నారు. అసెంబ్లీలో మేము అడిగితే మేమెక్కడ అన్నామని అంటున్నారు. అబద్ధాలను,గోబెల్స్ ను ప్రచారం చేస్తున్నారు.

రుణమాఫీ విషయంలో రేవంత్ రెడ్డి ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిది. రుణమాఫీ విషయంలో రేవంత్ రెడ్డి గజదొంగ. వంద శాతం రుణమాఫీ చేస్తామని మోసం చేశావు.మీ మంత్రులు,ఎమ్మెల్యేలు రుణమాఫీ జరగలేదని అంటున్నారు. రుణమాఫీ కాలేదని కాంగ్రెస్ ఎమ్మెల్యే అధికారులపై పేపర్లు విసిరేశారు. రుణమాఫీ ప్రక్రియ కొనసాగుతుందని తుమ్మల చెప్పారు.

ఆగస్టు 15 లోగా ఎందుకు రుణమాఫీ చేయలేకపోయారు? నేను విసిరిన ఛాలెంజ్ అదే.50 లక్షల రూపాయలు ఇస్తూ దొరికిన దొంగ రేవంత్ రెడ్డి. బిఆర్ఎస్ అంటేనే భారత రైతు సమితి.

ఢిల్లీలో రాహుల్ గాంధీని రేవంత్ రెడ్డి తప్పుదోవ పట్టిస్తున్నారు. రాహుల్ గాంధీ ఎప్పుడు హైదరాబాద్ వస్తారో చెప్పాలి. నేను ఎయిర్ పోర్టుకు వెళ్లి రాహుల్ గాంధీని రిసీవ్ చేసుకుని, సీఎం స్వంత గ్రామానికి రుణమాఫీ అయిందో లేదో చెప్పడానికి తీసుకువెళ్తా. వ్యవసాయ శాఖ మంత్రి చెప్పినట్లు 20 లక్షల మందికి రుణమాఫీ కాలేదు.రుణమాఫీ విషయంలో రాహుల్ గాంధీని రేవంత్ రెడ్డి మోసం చేశారు.వరంగల్ సభకు రాహుల్ గాంధీని మూడు సార్లు రేవంత్ రెడ్డి పిలిచినా రావడం లేదు.

వాల్మీకి స్కామ్ పట్టపగలు నిలువు దోపిడీ. ప్రభుత్వ డబ్బుతో కార్లు,బంగారం కొన్నారు. తెలంగాణకు చెందిన తొమ్మిది కంపెనీల అకౌంట్స్ కు డబ్బులు ట్రాన్స్ఫర్ అయ్యాయి.వాల్మీకి స్కామ్ పై కాంగ్రెస్ నేతలు ఎందుకు నోరు మెదపడం లేదు? వాల్మీకి స్కామ్ డబ్బులు ఎవరికి వచ్చాయో నేను,రేవంత్ రెడ్డి వెళ్లి ఈడీ విచారణ కోరుతాము. దానికి రేవంత్ రెడ్డి సిద్ధమా? వాల్మీకీ స్కామ్ పై ఈడీ విచారణ కోరే దమ్ము కాంగ్రెస్ పార్టీకి ఉందా.?

తెలంగాణలో కాంగ్రెస్,బీజేపీ కుమ్మక్కు అయ్యాయి. వాల్మీకి స్కామ్ పై తెలంగాణలో ఈడీ విచారణ ఎందుకు జరగడం లేదు? వాల్మీకి స్కామ్‌పై రాహుల్ గాంధీ ఎందుకు మాట్లాడటం లేదు? వాల్మీకి స్కామ్ పై కాంగ్రెస్,బీజేపీ నేతలు కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ ఎందుకు మాట్లాడటం లేదు? వాల్మీకి స్కామ్ పై ఈడీ విచారణ చేయాలని బిఆర్ఎస్ తరపున ఈడీని కలుస్తాము.

కాంగ్రెస్ ప్రభుత్వం అంటే కూల్చివేతల సర్కార్. హైదరాబాద్ బ్రాండ్ ను కూల్చివేశారు. కేసీఆర్ కిట్,రైతు బంధును కూల్చి వేశారు. ఎమ్మెల్యేల ఫిరాయింపుతో ప్రజాస్వామ్యాన్ని కూల్చారు. రాష్ట్రంలో వైద్య వ్యవస్థను కూల్చారు. దేవుళ్ళపై ఒట్టు వేసి ప్రజల విశ్వాసాలను కూల్చారు. గౌర్రెల కాపర్ల ఉపాధిని కూల్చారు.

హైడ్రా ఆఫీసు బుద్ధ భవన్ నాలా కింద ఉంది దాన్ని కూలగొడతారా? రంగనాథ్ తన ఆఫీసును కూలగొట్టుకుని ఇతర బిల్డింగులు కూలగొట్టాలి. జిహెచ్ఎంసి ఆఫీసు నాలా కింద ఉంది.దాన్ని కూలగొడతారా? నెక్లెస్ రోడ్ పక్కన ఉన్న రెస్టారెంట్స్,ఇతర వాణిజ్య భవనాలను కూలగొడతారా?

మీరాలం,ఉప్పల్, రామంతపూర్ చెరువుల్లో పెద్ద,పెద్ద టవర్లు వచ్చాయి. పొంగులేటి ఇంట్లో నీళ్లు చెరువులోకి వెళ్తున్నాయా? ఎక్కడికి వెళు న్నాయి? పొంగులేటి ఇంటికి ఏమైనా స్పెషల్ గా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఉందా?

మిషన్ కాకతీయపై విచారణ చెయ్యి అధికారం నీ చేతులోనే ఉంది కదా రేవంత్ రెడ్డి.

తెలంగాణ తల్లి విగ్రహానికి శంఖుస్థాపన చేస్తే మంత్రులు ఎవరు రాలేదు. తెలంగాణ తల్లికి రూపం ఇచ్చింది కేసీఆర్. కేసీఆర్ ఆనవాళ్ళపై రేవంత్ రెడ్డి నిలబడ్డారు. సీఎం స్థాయిలో ఉండి సుప్రీంకోర్టు తీర్పును తప్పుబట్టడం నేరం. వక్రబుద్ధి ఉంటే అన్ని వంకరగా కనిపిస్తాయి.

ఓటుకు నోటు కేసులో రేవంత్ రెడ్డికి బెయిల్ బీజేపీ ఇస్తేనే వచ్చిందా? సీఎం రేవంత్ రెడ్డికి సుప్రీంకోర్టు మొట్టికాయలు వేసింది. కవిత బెయిల్ విషయంలో న్యాయం,ధర్మం గెలిచింది. ఈడీ,సీబీఐపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. సిసోడియాకు బెయిల్ వస్తే బీజేపీతో పోరాటం.. కవితకు బెయిల్ వస్తే బీజేపీతో లాలూచీనా? ఫోర్త్‌సిటీ పేరుతో ప్రభుత్వ భూములు కొల్లగొట్టే కుట్ర జరుగుతోంది. సమయం వచ్చినప్పుడు అన్ని వివరాలు బయట పెడతాను

కందుకూరులో 385 ఎకరాలు సర్వే నంబర్ 9 లో ప్రభుత్వ భూమిని కొల్లగొట్టడానికి సర్వే చేస్తున్నారు. తుక్కుగూడలో 25 ఎకరాలు సర్వే నంబర్ 895 లో పేద రైతుల దగ్గర బినామీల పేరుతో తీసుకుంటున్నారు. ముచ్చర్లలో ప్రభుత్వంలో పెద్దలుగా చలామణీ అవుతున్న తమ్ముళ్ల పి.ఏల పేరు మీద భూములు కొంటున్నారు.

సీఎం రేవంత్ రెడ్డి స్వంత నియోజకవర్గం కొడంగల్ లో ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ మెజారిటీ తగ్గింది. రేవంత్ రెడ్డి దగ్గర ఉండి డి.కె.అరుణను గెలిపించారు. మోడీతో మాట్లాడుకొని వచ్చి తెలంగాణలో బీజేపీ ఎంపీలను రేవంత్ రెడ్డి గెలిపించారు. హైడ్రా విషయంలో అందరికీఒకటే రూల్ ఉండాలి. కాంగ్రెస్ పార్టీలో ఉన్న పట్నం మహేందర్ రెడ్డి,గుత్తా అమిత్ రెడ్డిని రేవంత్ రెడ్డి సస్పెండ్ చేయాలి. ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం 42 శాతం బీసీలకు రిజర్వేషన్లు ఇచ్చి స్థానికసంస్థల ఎన్నికలు జరపాలి. రాహుల్ గాంధీ ఆదానీ వద్దు అంటే, రేవంత్ రెడ్డి అదానీ కావాలని అంటున్నారు. రుణమాఫీపై మేము రిపోర్ట్ ఇస్తే రేవంత్ రెడ్డి సీఎం పదవిలో ఉండి ఎందుకు? ప్రజల కోసం పోరాడే బాధ్యతను ప్రజలు బిఆర్ఎస్ పార్టీకి ఇచ్చారు.

నమస్తే ఉదయం
తెలుగు దినపత్రిక


## బెదిరింపులకు పాల్పడుతున్న ఇద్దరు నిందితుల రిమాండ్..

రాజేంద్రనగర్,ఆగస్టు 29 (నమస్తే ఉదయం) : ఓ కిరాణా షాపు యజమానిని బెదిరించి డబ్బులు వసూలు చేసిన ఇద్దరు నిందితులను అత్తాపూర్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు. అత్తాపూర్ ఎస్సై వెంకన్న తెలిపిన వివరాల ప్రకారం... ఈ నెల 26 న పోలీస్ స్టేషన్ పరిధిలోని శివరాంపల్లి ప్రశాంత్ నగర్ కాలనీలో రాహుల్ వర్ధన్ గౌడ్ కిరాణా షాపుకు ముజహిద్ మొయినుద్దీన్, అబ్దుల్




రహీంలు వెళ్లి అంటి కరప్షన్ నుంచి వచ్చమని చెప్పి షాప్ లో ఇల్లీగల్ ఆక్టివిటీస్ చేస్తున్నారని చెబుతూ షాప్ ను వీడియో తీయడం ప్రారంభించారు.షాప్ వీడియోను సోషల్ మీడియా లో వైరల్ చేస్తామని చెప్పి షాప్ యజమానికి 10వేలు ఇవ్వాలని డిమాండ్ చేసారు.దీంతో షాప్ యాజమాని 3 వేల రూపాయలు ఇచ్చి మిగతా డబ్బులు రెండు రోజుల్లో ఇస్తానని సర్ది చెప్పాడు. మిగత 7 వేల రూపాయల కోసం పదే పదే ఫోన్లు చేస్తూ యజమానిపై బెదిరింపులకు పాల్పడ్డారు. దింతో రాహుల్ అత్తాపూర్ పోలీసులను ఆశ్రయించాడు.కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.బుధవారం ఇద్దరు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకొని వారి నుంచి రెండు బైక్ లు,రెండు సెల్ ఫోన్లు,ఐడి కార్డులను స్వాదినం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించారు.

## రోడ్డు ప్రమాదంలో బుక్క వేణుగోపాల్ మేనల్లుడు వెంకటరమణ మృతి



శంషాబాద్, ఆగస్టు 29( నమస్తే ఉదయం): భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బుక్క వేణుగోపాల్ మేనల్లుడు గోనె వెంకటరమణ మహబూబ్ నగర్ జిల్లా భూత్పూర్ సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. వెంకటరమణ తో పాటు మరో ఏడుగురు తిరుమల తిరుపతి వెంకటేశ్వర స్వామి దర్శనం చేసుకొని గురువారం తెల్లవారుజామున తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ముందుగా వెళుతున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి రోడ్డు పక్కన నిలిచి ఉన్న డీసీఎం వాహనాన్ని కారు ఢీకొన్నది. ఈ ప్రమాదంలో వెంకటరమణ తో పాటు మరో ఇద్దరు అక్కడికక్కడే మరణించగా మిగతా వారిని సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. బుక్క వేణుగోపాల్ మేనల్లుడుగా శంషాబాద్ మండల ప్రజలకు సుపరిచితుడైన వెంకటరమణ మరణంతో విషాదఛాయలు అమ్ముకున్నాయి. నగరంలోని సైదాబాద్ వద్ద జరిగిన అంత్యక్రియల్లో బంధుమిత్రులు పెద్ద ఎత్తున పాల్గొని వీడుకోలు పలికారు.

## వీరాంజనేయ స్వామి ఆలయ పునర్నిర్మాణానికి భూమి పూజ..

### - ఆలయ నిర్మాణానికి దాతలు సహకరించాలి..

రాజేంద్రనగర్,ఆగష్టు 29(నమస్తే ఉదయం): మైలార్ దేవ్‌పల్లి డివిజన్ పరిధి మధుబన్ కాలనీలో శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయ పునర్నిర్మాణానికి పురోహితులు ఆధ్వర్యంలో గురువారం కాలనీ ప్రతినిధులు భక్తి శ్రద్ధలతో భూమి పూజ చేశారు.దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ పునర్నిర్మాణానికి



మధుబన్ కాలనీలో ఆలయ నిర్మాణం కోసం భూమి పూజ చేస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు



సంకల్పించారు.

దేవాలయం నిర్మాణానికి దాతలు ముందుకు రావాలని ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు.ఆంజనేయస్వామి ఆశీర్వాదం ప్రజలందరికి ఉంటుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మధుబన్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు గోవిందు రాజ్, ఉత్తంకుమార్, ఉదయ్, కిషోర్, సంపత్, చిన్న, శివాజీ, లోకేష్ డీజే, సామల సతీష్, బుచ్చిరెడ్డి, డివి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ముద్ర , ధని లోన్ ఫేక్ యాప్‌ల ద్వారా 20 లక్షల డబ్బులు కాజేసిన సైబర్ నేరస్తుల ముఠా అరెస్ట్

### - జిల్లా ఎస్పీ శ్రీ రావుల గిరిధర్

### నిందితుల నుండి 26 మొబైల్ ఫోన్ లు, 22 సిమ్ కార్డులు , 5 మోటార్ సైకిల్‌లు, 85 వేల నగదు , 10 లక్షల విలువైన వస్తువులు, నగదు జప్తు.



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న ఎస్ పి రావుల గిరిధర్

కొత్తకోట, ఆగస్టు29(నమస్తే ఉదయం): ముద్ర , ధని లోన్ ఫేక్ యాప్ ల ద్వారా 20 లక్షల డబ్బులు కాజేసిన సైబర్ నేరస్తుల ముఠా ను పోలీసులు అరెస్ట్ చేశారు.జిల్లా ఎస్పీ శ్రీ రావుల గిరిధర్ తెలిపిన వివరాల ప్రకారం...

కొత్తకోటకు చెందిన కొత్త కుమ్మరి రాజు అనే వ్యక్తి ముద్ర విశ్వకర్మ లోన్ కు జనవరి నెలలో ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకున్నాడు. కొన్ని రోజుల తరువాత జులై ఏడో తేదీన సైబర్ నేరగాళ్లు ఒక వాట్సప్ నెంబర్ నుండి అతని వాట్సప్ నెంబర్ కు ప్రధానమంత్రి విశ్వకర్మ లోన్ మంజూరు కావడానికి డబ్బులు పంపించాలని మెసేజ్ పంపగా అతను సదరు వ్యక్తి గూగుల్ పే, ఫోన్ పే నెంబర్లకు రెండు విడతలలో మొత్తం రూ 12,250/- పంపించాడు. మరలా టాక్స్ కట్టాలని 9,000/- అడగగా తనకు అనుమానం వచ్చి, వెంటనే తాను మోస పోయానని వెంటనే కొత్తకోట పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. కొత్తకోట పోలీసు లు ఎఫ్ ఐ ఆర్ 212/2024 U/s 318 (4) BNS, Sec 66 (D) IT Act కేసు నమోదు చేసినారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు తు చేయగా

కేసు పరిశోదనలో భాగంగా మొదటగా పెద్దమందడి మండలం జంగమయ్య పల్లికి చెందిన కురుమూర్తి అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారించగా నేరాన్ని అంగీకరించారు.ఈ నేరానికి సూత్రదారి అయిన నర్సింగ్ నాయక్ అనే వ్యక్తి వనపర్తి లో ఉంటాడని చెప్పగా అతనిని అదుపులోకి తీసుకొని విచారించగా నేరం చేసినట్లు ఒప్పుకోవటంతో రుజువైంది. అతను వనపర్తిలో ఒక గది కిరాయి తీసుకొని రత్లావత్ రమేశ్, ఇస్లావాత్ రాములు ఏ బాబు, కొత్తపల్లి ఉమేశ్, బోయ వీరేష్, ఇద్దరు మైనర్లు ను ఉంచి ముద్రా లోన్ ధని లోన్ యాప్‌ల ద్వారా సేకరించిన కస్టమర్ల వివరాలు (పేరు, ఫోన్ నెంబర్, చిరునామా, ఈమెయిల్ దరఖాస్తు చేసుకున్న తేదీ ,ఎంత లోన్ కావాలి అనే తదితర వివరాలు) కలిగిన ఎక్సెల్ ఫైల్ ను ను నర్సింగ్ బీహార్ కి చెందిన రోహిత్ అనే వ్యక్తి నుండి సేకరించి, తన దగ్గర ఉన్న ఫోన్‌లను తీసుకొని, వనపర్తి చుట్టుపక్కల నిర్మానుష్యంగా ఉన్న స్థలాలకి తన టీంతో వెళ్ళి, ఆ డేటాలో ఉన్న కస్టమర్లకు ఫోన్ చేసి వారికి లోన్ మంజూరు చేయిస్తానని నమ్మించి వారి దగ్గర నుండి ఇన్సూరెన్స్, టీడీఎస్, జిఎస్టి, ఫైల్ క్లోజింగ్ చార్జెస్, ప్రాసెసింగ్ ఫీస్, సర్విస్, డాక్యుమెంట్ చార్జెస్ అని చెప్పి మారు పదివేలు నుండి 40 వేల రూపాయలు తీసుకొని వారికి లోన్ మంజూరు అయిందని ఒక ఫేక్ డాక్యుమెంట్ సృష్టించి పంపేవాడు, సాయంత్రం వరకు కస్టమర్లకు ఫోన్ చేసి, తరువాత ఫోన్ లు స్విచ్ ఆఫ్ చేసి ఇంటికి వచ్చేవారు. బాధితుల నుండి కొట్టేసిన డబ్బులో రోహిత్ నుండి 50% తీసుకొని, నర్సింగ్ తన వంతుగా 25% ఉంచుకొని, మిగతా 25% డబ్బులు తన టీం అందరికీ కమిషన్ రూపంలో డబ్బులు ఇచ్చేవాడు అని విచారణలో తేలినట్లు పోలీసులు తెలిపారు.

ముద్ర, ధని లోన్ యాప్ ల ద్వారా మోసపోయిన సైబర్ ఫిర్యాదులు రాష్ట్ర స్థాయిలో పెద్ద మొత్తం లో నమోదు కాగా ఈ ఫిర్యాదుల విచారణలో భాగంగా కొత్తకోట పోలీస్ స్టేషన్‌లో నమోదు అయిన కేసు విచారణను తెలంగాణ సైబర్ సెక్యూరిటి బ్యూరో ఇంచార్జి అదనపు డీజీపీ షికా గోయల్ ఆదేశాల మేరకు వనపర్తి జిల్లా ఎస్ పి గిరిధర్ అధ్వర్యంలో జిల్లా సైబర్ సెక్యూరిటి ఇంచార్జి రత్నం, కొత్తకోట ఇన్స్పెక్టర్ రాంబాబు , సబ్ ఇన్స్పెక్టర్ . మంజునాథ్ రెడ్డి లు , జిల్లా పోలీసు సిబ్బంది సంయుక్తంగా దర్యాప్తు చేసి సైబర్ నేరస్తులను గుర్తించారు. ఈ నేరానికి పాల్పడిన వారిలో 8 మందిని అరెస్ట్ చేశారు.8 మంది సైబర్ నేరగాళ్లలో ఇద్దరు బాలురు ఉన్నారు. వీరందరూ రెండు తెలుగు రాష్ట్రాలలో సుమారు వేయి నుండి 2 వేల మందికి ఫోన్ చేసి మోసం చేయటానికి ప్రయత్నం చేశారు. కానీ దాదాపు 250 మందిని మోసం చేసి 20 లక్షల మోసగించి కాజేసినారు. నేరానికి పాల్పడిన

వారి వద్ద నుండి 26 మొబైల్ ఫోన్లు, అందులో 2 Apple i-ఫోన్ లు, 15 ఆండ్రోయిడ్ స్మార్ట్ ఫోన్ లు, 9 Keypad మొబైల్ ఫోన్ లు ఉన్నాయి . మొత్తం ఫోన్ ల విలువ సుమారు ఐదు లక్షల రూపాయలు , 22 కంపనీల సిమ్ కార్డులు, 5- ద్విచక్ర వాహనాలు 5 (జావా - 1, స్కూటర్లు-3, హొండా సిబి షైన్-1, వీటి మొత్తం విలువ రూ 4,15,000/తో పాటు 85 వేల నగదు ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

# వినాయక చవితి ఉత్సవాలు

## భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలి: డీసీపీ చింతమనేని శ్రీనివాస్

### ఉత్సవాలకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలి: గణేష్ ఉత్సవ సమితి

### పల్లె చెరువు, పత్తికుంట చెరువులను పరిశీలించిన అధికారులు, గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు



రాజేంద్రనగర్, ఆగస్టు29(నమస్తే ఉదయం) : రాజేంద్రనగర్ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వ ర్యంలో గురువారం పత్తికుంట, (రాజేంద్ర నగర్) పల్లె చెరువు, (మైలార్‌దేవ్‌పల్లి) చెరువుల లో ఏర్పాట్లకు సంబంధించి డీసీపీ చింత మనేని శ్రీనివాస్,

ఏసీపీ తుల శ్రీనివాస్, రాజేంద్రనగర్ డిప్యూటీ కమిషనర్ కె. రవికుమార్ , సిఐ లు కాస్ట్రో, పి.నరేందర్, వివిధ శాఖల అధికారులు వినాయక నిమజ్జనానికి సంబంధించిన ఏర్పాట్ల ను వివరించారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులు, వివిధ సంఘం నేతలు అందరూ కలిసి ఏర్పాట్లను పరీక్షించారు. చెరువులో పూడిక తీసివేత అలాగే క్రేన్లని ఏర్పాటు చేయడం, లైట్లు ఏర్పాటు, రోడ్లకు సంబంధించిన ఏర్పాట్లు చేయాలని నిర్ణయం చేశారు.

డీసీపీ చింతమనేని శ్రీనివాస్ మాట్లాడుతూ రాజేంద్రనగర్ సర్కిల్‌లోని మండపాలలో ఏర్పాటు చేసుకున్న వినాయకులను నిమజ్జనం చేయడానికి పత్తికుంట, పల్లెచెరువుకు ఎక్కువ వినాయకుళ్లు నిమజ్జనం చేస్తారు కనుక పోలీస్ బందోబస్తు, జీహెచ్‌ఎంసీ, విద్యుత్ శాఖ అధికారులు వాళ్ళు కానీ దగ్గరుండి అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. నిమజ్జనానికి వచ్చే భక్తులకి ఎలాంటి ఇబ్బందులు కలగకుండ చూడాలని కోరారు భాగ్యనగర్ గణేశ ఉత్సవ సమితి రాజేందర్ నగర్ కో కన్వీనర్ బొక్క బాల్ రెడ్డి మాట్లాడుతూ, భాగ్యనగర్ గణేష్ ఉత్సవంతి ఆధ్వర్యంలో ఈసారి రాజేందర్ నగర్ ఉత్సవ సమితి ఏర్పడిందన్నారు.

ఈ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో భక్తులకు, వినాయక మండపాల ఏర్పాటుకు సంబంధించి, ఏవైనా సమస్యలు ఉంటే రాజేందర్ నగర్ గణేష్ ఉత్సవ సమితికి తెలియజేయాలన్నారు. ఎలాంటి ఇబ్బందులు ఉన్న పోలీసు, జీహెచ్‌ఎంసీ, కరెంటు డిపార్ట్మెంట్‌తో మాట్లాడి ఇబ్బందులు .లేకుండా చూస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో నాయకులు ఎన్. మల్లా రెడ్డి, ఎం.కొమురయ్య , పి. మల్లెష్ యాదవ్, డి. సత్యనారాయణ ముదిరాజ్, జి.బాబురావు, ఎస్. విజయ్, మ్యాడం రామేశ్వరరావు, అడికే జనార్దన్ ,రావుల భాస్కర్, శాస్త్రి పురం నిఖిలేష్ సచిన్ కిషన్‌లు పాల్గొన్నారు.

## దేశ భవిష్యత్తును రూపొందించడంలో సాంకేతిక విద్యది ప్రముఖ పాత్ర

### హరే కృష్ణ మిషన్ యూత్ ఎంపవర్మెంట్ హైదారాబాద్ హెడ్ బ్రజా బంధుదాస్

### జేబీ ఐఈటీ ఇంజనీరింగ్ కళాశాలలో ఘనంగా ఓరియంటేషన్ డే

మొయినాబాద్,29(నమస్తే ఉదయం): దేశ భవిష్యత్తును రూపొందించడంలో సాంకేతిక విద్య ఎంతో ప్రాముఖ్యతను నొక్కి చెబుతుందని హరే కృష్ణ మిషన్ యూత్ ఎంపవర్మెంట్ హైదారాబాద్ హెడ్ బ్రజా బంధుదాస్ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని జేబీ ఐఈటీ ఇంజనీరింగ్ కళాశాలలో ఓరియంటేషన్ కార్యక్రమాన్ని విద్యా సంస్థల కార్యదర్శి జే.వి. కృష్ణారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా హరే కృష్ణ మిషన్ యూత్ ఎంపవర్మెంట్ హైదారాబాద్ హెడ్ బ్రజా బంధుదాస్ పాల్గొని జ్యోతి ప్రజ్వాలన చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ భవిష్యత్తును రూపొందించడంలో సాంకేతిక విద్య ప్రాముఖ్యతను నొక్కిచెబుతుందని తెలిపారు. ఉన్నత విద్య ఎంతో విలువైందని అందులో విద్యార్థులు నాలుగు సంవత్సరాల పాటు కష్టపడి చదివితే మంచి భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. ఇందు కోసం క్రమ శిక్షణ, పాటిస్తు నాణ్యమైన విద్యను అభ్యసిస్తు మీ భవిష్యత్తుకు బంగారుబాటలు వేసుకోవాలని తెలిపారు. తల్లిదండ్రులు ఎంతో కష్టపడి పని చేస్తూ తమ పిల్లలను ఉన్నత స్థాయికి ఎదిగేందుకు ఎదురు చూస్తారని అందుకు నిదర్శనంగా మీ భవిష్యత్తు బంగారు భవిష్యత్తు వైపు పయనించాలని తెలిపారు. ఇండియా పర్సూసా ఫ్రీడ్జ యూనిట్ హెడ్ అభిషేక్ లీడ్ మాట్లాడుతూ ఇంజనీరింగ్ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు ప్రభుత్వంలో, ప్రైవేటులో ఉన్నత స్థానాల్లో ఉన్నారని తెలిపారు. తల్లిదండ్రులు పిల్లలను మొదటి సంవత్సరం నుంచే గమనిస్తుండాలని తెలిపారు. వారికి సదుపాయాలను అవసరం మేరకు ఇవ్వాలని అన్నారు. విద్యార్థులు సమయాన్ని సరైన విధంగా ఉపయోగించుకోని ఉన్నత స్థానాలకు ఎదగాలని సూచించారు. అనంతరం విద్యా సంస్థల కార్యదర్శి




కృష్ణారావు మాట్లాడుతూ జేబీ గ్రూప్ విద్యా సంస్థల్లో నాణ్యమైన విద్యను అందించేందుకు అన్ని విధాలుగా కృషి చేస్తున్నామని తెలిపారు. విద్యార్థులలో క్రమ శిక్షణ, స్నేహ సంబంధాలు పెంపొందిస్తు ఉన్నత స్థానానికి ఎదిగేందుకు కృషి చేస్తున్నామన్నారు. విద్యార్థులకు చెడు అలవాట్లు రాకుండా ఉండేలా ప్రతి రోజు కళాశాలలో పరిశీలించడం జరుగుతుందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను. అందించేందుకు కృషి చేస్తున్నామని ఇందుకు తల్లి దండ్రులు కూడా వారిని, వారి నడవడికలను, విద్య పట్ల పరిశీలించి మంచి మార్గంలో నడిపేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ కృష్ణమాచారి, క్యాంపస్ థియేటర్ రాజశేఖరెడ్డి, డీన్ అడ్మిన్ డాక్టర్ సలావుద్దీన్, భాస్కర ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఏ. శ్రీ నివాసరావు, భాస్కర ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సుమన్ పట్నాయక్, అధ్యాప కులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## జోనల్ స్థాయి ఫ్రీడమ్ క్రికెట్ పోటీల్లో శివరాంపల్లి జిల్లా పరిషత్ పాఠశాలకు మొదటి బహుమతి


రాజేంద్రనగర్, ఆగస్ట్ 29(నమస్తే ఉదయం): రాజేంద్రనగర్ మండల జోనల్ స్థాయి ఫ్రీడమ్ క్రికెట్ లలో శివరాంపల్లి జిల్లా పరిషత్ హై స్కూల్ కు ప్రథమ స్థానం లభించింది. ఈనెల 28న మోహినాబాద్ లోని పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్ జరిగిన క్రికెట్ పోటీలో శివరాంపల్లి జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థులు మొదటి బహుమతి గెలుపొందారు.

ఈ పోటీలలో 4 మండలాల (శంషాబాద్, రాజేంద్రనగర్, గండిపేట, మొయినాబాద్)నుండి 20జట్లు పాల్గొన్నాయి. శివరాంపల్లి విద్యార్థులు సాంఘిక గురుకుల పాఠశాల చిల్కూర్ విద్యార్థులపై గెలుపొందారు. గెలు పొందిన విద్యార్థులను అభివృద్ధి కమిటీ అధ్యక్షులు పడమటి శ్రీధర్ రెడ్డి, ప్రధానోపాధ్యా యులు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

### నేడు రాజేంద్రనగర్ జోనల్ స్థాయి

## క్రికెట్ ఎంపిక ప్రక్రియ..

### - మండల విద్యాధికారి శంకర్ రాథోడ్



**రాజేంద్రనగర్,ఆగస్టు 29 (నమస్తే ఉదయం):** రాజేంద్రనగర్ జోనల్ స్థాయి క్రికెట్ ఎంపిక ప్రక్రియను శుక్రవారం నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారి శంకర్ రాథోడ్ తెలిపారు. ఈ ప్రక్రియను రాజేంద్రనగర్ జోన్ పరిధిలోని పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్‌లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఈ సందర్భంగా మండల విద్యాధికారి శంకర్ రాథోడ్ మాట్లాడుతూ...ఎస్ జి ఎఫ్ రాజేంద్రనగర్ స్థాయి క్రికెట్ పోటీలలో శు క్రవారం నిర్వహించనున్నామన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి ఫిజికల్ డైరెక్టర్లు, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లు పాఠశాలలలోని అగ్రశ్రేణి క్రీడాకారులను ఎంపిక చేసి పంపా లని తెలిపారు.

అండర్ 17 విభాగంలో ముగ్గురు ఆటగాళ్లను పంపాలని వివరించారు. ఈ కార్యక్రమానికి రాజేంద్రనగర్ జోనల్ సెక్రెటరీ గంగ్యా నాయక్,పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపాల్ హేమ మధుబుషి సహకరించను న్నట్లు తెలిపారు. ఈ మేరకు ఉదయం 8:30 గంటలకు ప్రతిభావంతులైన క్రీడాకారులు రిపోర్ట్ చేయాలని తెలిపారు.


## ఘనంగా డాక్టర్ కార్తికేయ, డాక్టర్ సౌమ్యశ్రీల కళ్యాణం



### నూతన వధూ వరులను ఆశీర్వదించిన ప్రముఖులు, పెద్దలు, కుటుంబ సభ్యులు

**శంషాబాద్, ఆగస్టు29(నమస్తే ఉదయం):** తెలంగాణ వైద్య విధాన పరిషత్ మాజీ కమిషనర్ డాక్టర్ బి శివప్రసాద్, డాక్టర్ బి గీత దంపతులకు కుమారుడు కార్తికేయ కళ్యాణం సౌమ్య శ్రీ తో జరిగింది. గురువారం శంషాబాద్ లోని మల్లిక




శ్రీరస్తు శుభమస్తు అవిఘ్నమస్తు
వివాహ మహోత్సవ ఆహ్వాన శుభ పత్రిక
మల్లిక కన్వెన్షన్
హెచ్-44, శంషాబాద్, రంగారెడ్డి జిల్లా - 501 218.
ఫోన్ నెం. 040-29703488
ఆహ్వానించువారు
శ్రీమతి డా॥ బ్యాల్య గీత
శ్రీ డా॥ బ్యాల్య శివప్రసాద్

కన్వెన్షన్ లో జరిగిన డాక్టర్ కార్తికేయ, డాక్టర్ సౌమ్యశ్రీల వివాహ వేడుకలకు ప్రముఖులు, పెద్దలు, కుటుంబ సభ్యులు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.





కంట్రీ మేడ్ పిస్తల్‌ను చూపిస్తున్న డీసీసీ చింతమనేని శ్రీనివాస్, స్వాధీనం చేసుకున్న కంట్రీ మేడ్ పిస్తల్, తూటా, సెల్‌ఫోన్

## కంట్రీ మేడ్ పిస్తల్ చూపుతు దారిన పోయే వారిని దోచుకుంటున్న బీహార్ ముఠాలోని ఇద్దరు వ్యక్తులు అరెస్ట్

### - మరొకరి కోసం గాలిస్తున్న పోలీసులు

**రాజేంద్రనగర్, ఆగస్టు29(నమస్తే ఉదయం):** కంట్రీమేడ్ పిస్తల్ చూపుతు చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు బిహారీ గ్యాంగ్ సభ్యులలో ఇద్దరిని రాజేంద్రనగర్ పోలీసులు గురువారం వారం ఉప్పర్‌పల్లి వద్ద పట్టుకున్నారు. వివరా లను రాజేంద్రనగర్ డీసీసీ. సిహెచ్ శ్రీనివాస్ తన కార్యాల యంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు.

బీహార్ రాష్ట్రం పూర్నియా జిల్లా, హక్కా ప్రాంతానికి చెందిన మహమ్మద్ ముసాయిద్ ఆలామ్ (28) పిల్లర్ నెంబర్ 190 వద్ద గల హ్యాపీ హెూమ్స్ అవెన్యూలోని రెండవ అంతస్తులు అద్దెకు నివాసం ఉంటున్నాడు. అతనితో పాటు బీహార్ కు చెందిన మహమ్మద్ దిల్బర్(24), మహమ్మద్ షానవాజ్(29)లు కూడ ఉంటారు. వీళ్ళు ముగ్గురు నగరంలో డెలివరీ బాయ్స్‌గా పనులు చేస్తారు. బీహార్ నుంచి నెల క్రితం ఓ కంట్రీ మేడ్ పిస్తల్ తీసుకువచ్చి జనచైతన్య వెంచర్ ఫేస్ -2 లో ఓ వ్యక్తిని బెదిరించి రూ. 11 వేలను దోచుకున్నారు. కిస్మత్‌పూర్ బ్రిడ్జి వద్ద రాత్రి వేళ ఒక వ్యక్తిని బెదిరించి అతని నుంచి సెల్ ఫోన్ తో పాటు రూ.200లు లాక్కున్నారు.


విశ్వసనీయ సమా చారం మేరకు రాజేంద్రనగర్ పోలీసులు వారిలో మహ్మద్ ముసాయిద్ అలామ్, మహ్మద్ దిల్బర్‌లి ద్దరిని అరెస్ట్ చేశారు.

వారి నుంచి ఓ కంట్రీ మెడ్ పిస్తల్, రూ.200ల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో మరొకరు మహ్మద్ షానవాజ్ తప్పించుకున్నట్లు పోలీసులు తెలిపారు.

## యువత స్వయంకృషితో ఎదగాలి

### - తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ సంఘం చైర్మన్ బుర్ర జ్ఞానేశ్వర్

**రాజేంద్రనగర్ ,ఆగస్టు 29(నమస్తే ఉదయం):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్వయం ఉపాధి కోసం యువత నిరుద్యోగ యువతకు రుణాలు ఇస్తూ కృషి చేస్తుందని తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ సంఘం చైర్మన్ బుర్ర జ్ఞానేశ్వర్ చిలుకూరు బాలాజీ దేవాలయ ప్రధాన అర్చకులు రంగరాజన్ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని బండ్లగూడ జాగిరి పరిధిలోగల కాళీమాత మందిర్ ఎదురుగా స్వయం ఉపాధి కోసం సత్యనారాయణ చారి, వినోద , కుమారుడు శ్రీకాంత్ చారి లు ఏర్పాటు చేసుకున్న జై భవాని వన్ క్లిక్ ఫోటో స్టూడియో డిజిటల ను ముఖ్య అతిథులుగా రంగరాజన్ స్వామి, బుర్ర జ్ఞానేశ్వర్ లు పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత తెలంగాణ రాష్ట్రంలో యువతకు ఉద్యోగాలు ఇస్తూ ఉద్యోగాలు రాని యెడల స్వయం ఉపాధి కోసం ఆర్థికంగా రుణాలు అందజేస్తుందని తెలిపారు ఇంటి కోసం వివిధ కోర్సులలో శిక్షణలిస్తు వారి భవిష్యత్తుకు ఉపాధిని కల్పించడం జరుగుతుందన్నారు ఏర్పాటు చేసుకున్న డిజిటల్ ఫోటోగ్రఫీ ప్రజలకు వినియోగకరంగా ఉండాలని వినియోగదారులకు



బండ్లగూడలో డిజిటల్ ఫోటో స్టూడియోను ప్రారంభిస్తున్న జ్ఞానేశ్వర్ ముదిరాజ్



చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకులు రంగరాజన్‌ను సన్మానిస్తున్న మహిళలు

సమయస్ఫూర్తితో వారు ఎంచుకున్న వాటిని ఎప్పటికప్పుడు సరఫరా చేయాలని పేర్కొన్నారు మంచిగా ఫోటోలు వీడియో తీసినప్పుడే ఫోటోగ్రఫీ గుర్తింపు వస్తుందని తెలిపారు కష్టపడి పనిచేస్తేనే ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో చిలుకూరు బాలాజీ భక్తుడు పవన్ కుమార్ , గోపాల్ ముదిరాజ్, సంపత్ గౌడ్, ప్రవీణ్ ముదిరాజ్, శ్రీహరి చారి, పాత్రికేయుడు రాంపల్లి సంతోష్ కుమార్ చారి, అమ రేందర్ చారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## నీటి సంపులో విద్యార్థులు-నిమ్మకు నీరెత్తినట్లు అధికారులు

### జిల్లా కేంద్రంలోని ఓ ప్రభుత్వ వసతీ గృహంలో నీటి కోసం నీటి సంపులో దిగిన విద్యార్థులు

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు29(నమస్తే ఉదయం):** కోటి కష్టాలు కూటి కోసం అన్నట్టు నీటి కోసం సంపులోకి దిగి విద్యార్థులు కష్టాలు పడుతున్న సంఘటన జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని మూడు హాస్టళ్లలో నెలకొంది. విద్యార్థులు తిన్న ప్లేట్లను కడుక్కోవాలన్న,చేతులు కడుక్కోవాలన్న, ఏదేని నిత్యావసరాలకు వాడుకోవాలన్న సంపులోకి దిగి నీరు తీసుకుంటూ కష్టపడుతున్నారు. కళ్ళ ముందు విద్యార్థులు నీటికోసం ఇంత కష్టపడుతున్నా అక్కడ పనిచేసే ముగ్గురు హాస్టల్ వార్డెన్లు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ముగ్గురు వార్డెన్లు నాన్ లోకల్ వాళ్ళు కావడంతో వార్డెన్లు హాస్టళ్లకు ఎప్పుడు వస్తారో,ఎప్పుడు వెళ్తారో తెలియని పరిస్థితి. వార్తల కోసం వెళ్లిన విలేకర్లను ఎంతోకొంత ముడుపులు చెల్లిస్తాం,మేము ముగ్గురం కొత్తగా వచ్చాం. ఈసారికి మమ్మల్ని వదిలేయండి,వార్తలు రాయకండి అంటూ బ్రతిమిలాడరట. విద్యార్థుల వ్యవహారం బయటకు పొక్కకుండగా ఉండేందుకు మరో కొంతమంది వార్డెన్లు రంగంలోకి దిగి విలేకర్లను సంధి చేకూర్చే పనిలో ఉన్నారట. దొంగలు, దొంగలు కలిసి గట్లు పంచుకున్నట్టు ఇలా హాస్టళ్ల పరిశీలనకు వచ్చిన అందరిని డబ్బులతో కొనేస్తే హాస్టల్ విద్యార్థుల సమస్యలు బయటకు వచ్చేదెలా?... పేపర్‌కి



సంవత్సరం చందా కట్టినట్టు కొంతమంది విలేఖరులకు, కొన్ని విద్యార్థి సంఘాలకు,కొంతమంది అధికారులకు సంవత్సరం మాములు ముట్టచెప్పుతున్నారని సమాచారం. అందరిలో కొందరిని డబ్బులకు కొనేస్తే భావితరాల విద్యార్థుల భవిష్యత్ ఏంది,ఎటుపోతుంది అనేది విద్యావంతుల ప్రశ్న.

### సంక్షేమ హాస్టల్లో సమస్యలు పరిష్కరిస్తాం: జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి రమేష్ బాబు

జిల్లాలో ఉన్న సంక్షేమ హాస్టళ్లలో నీటి సమస్య తలెత్తకుండా ప్రణాళికను రూపొందించి సమస్య పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ రమేష్ బాబు తెలిపారు.

జిల్లాకేంద్రంలో చింతలపేటలో గల ఎస్సీ-2, బీసి -1 హాస్టళ్లలు ఒకే చోట ఉండటంతో నీటి సమస్య తలెత్తింది. దీనిని అధిగమించడానికి వాటర్ ట్యాంక్ నిర్మాణానికి ఎస్టిమేషన్ వేసి ఉన్నతాదికారులకు నివేధిక సమర్పించడం జరిగింది.

త్వరలోనే పరిష్కరిస్తాం. విద్యార్థులకు అసౌకర్యాలు కలుగకుండా చూస్తాం. జిల్లాలో ప్రభుత్వ వసతీ గృహలకు ఒక్కో వార్డెన్ రెండు హాస్టళ్లకు ఇంచార్జిలు వ్యవహ రిస్తున్నారు. క్రమం తప్పకుండా వార్డెన్ లు అన్నీ హాస్టళ్లను పర్యవేక్షణ అయ్యే విధంగా చర్యలు తీసుకుంటాం. హాస్టళ్లలో మౌళిక వసతులు కల్పిస్తాం.

## విద్యతో పాటు క్రీడల్లో రాణించి దేశానికి ప్రాతినిధ్యం వహించాలి

### - కలెక్టర్ సంతోష్

**గద్వాల జిల్లా ప్రతినిధి,ఆగస్టు29(నమస్తే ఉదయం):** చిన్నతనం నుంచే విద్యతో పాటు క్రీడల్లో రాణించి దేశానికి ప్రాతినిధ్యం వహించాలని జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్ అన్నారు. గురువారం ఇండోర్ స్టేడియంలో జిల్లా క్రీడల శాఖ ఆధ్వర్యంలో మేజర్ ధ్యాన్ చంద్ జయంతి పురస్కరించుకొని జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని హాకీ దిగ్గజం స్వర్గీయ మేజర్ ధ్యాన్ చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జిల్లా కలెక్టర్ సంతోష్ మాట్లాడుతూ... విద్యార్థులు చిన్నతనం నుంచే చదువుతో పాటు క్రీడల్లో రాణించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. క్రీడలలో పాల్గొనడం విద్యార్థులకు శారీరక ,మానసిక ఆరోగ్యం దృఢంగా ఉండేందుకు సహకరిస్తుందని, అలాగే క్రీడలు రోజువారీ జీవితంలో భాగంగా ఉండాలని అన్నారు. మేజర్ ధ్యాన్ చంద్ స్ఫూర్తితో యువత హాకీ వంటి క్రీడల్లో ప్రావీణ్యం సాధించాలన్నారు. 1928, 1932, 1936 ఒలింపిక్స్ లో స్వర్ణ పతకాలు గెలిచిన ధ్యాన్ చంద్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని క్రీడల్లో ప్రతిభ కనబర్చాలన్నారు. అంతేకాకుండా క్రీడల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు ప్రొఫెషనల్ ప్లేయర్స్ గా ఎదిగి, ఒలింపిక్స్ కు దేశానికి ప్రాతినిధ్యం వహించాలని ఆకాంక్షించారు.వాకర్స్ అసోసియేషన్ ఫిజికల్ ఫిట్ నెస్ పై అవగాహన కల్పించాలన్నారు. తదుపరి క్రీడలలో విజేతలైన విద్యార్థులకు జిల్లా కలెక్టర్ మెమెంటోలు అందజేశారు. రిటైర్డ్ ఫిజికల్ డైరెక్టర్లను అంతర్జాతీయ స్థాయిలో టైక్వాండో మాస్టర్ కోర్సులో గోల్డ్ మెడల్ సాధించిన శ్రీహరి, రాష్ట్ర స్థాయి స్వర్ణ పతక విజేతలను సన్మానించారు. ముగింపులో క్రీడా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించి, ర్యాలీకి జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడా అధికారి బి.ఎస్ ఆనంద్, రిటైర్డ్ ఫిజికల్ డైరెక్టర్లు, పి.ఈ.టి లు, విద్యార్థులు, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.



క్రీడ ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న కలెక్టర్ సంతోష్


**Printed and Published MEKALA DAMODAR REDDY** on behalf of VANITHA Publications, and Printed at Vanitha Graphics, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy,Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.Damodhar Reddy. "RNI. Title- Code: TELTEL/2023/87699.** Cell: 9492148733